సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 6 । జూలై । 2025



నిత్యాన్నదానానికి రూ.58 వేలు


అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కొత్తపల్లి రవిశంకర్ (హైదరాబాద్) శనివారం రూ.58 వేల విరాళం సమర్పించారు.



శృంగార వల్లభునికి విరాళం

పెద్దాపురం: తొలి తిరుపతిలో వెలసిన శృంగార వల్లభ స్వామివారికి అన్నదాను సాయిరామ్ దంపతులు (రాజానగరం మండలం ముక్కి నాడ) రూ.1,08,000 విరాళం అందజేశారు.

డెల్టాలకు 12,450 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 12,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 2,450, పశ్చిమ డెల్టాకు 5,800 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీల్లో ఐదుగురికి చోటు

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ కమిటీలలో జిల్లా నుంచి నలుగురికి స్థానం లభించింది. పార్టీ కేంద్ర కార్యాలయం ఈ సమాచారాన్ని జిల్లా పార్టీకి పంపించింది. రాష్ట్ర వలంటీర్స్ విభాగం జోనల్ అధ్యక్షుడిగా రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన కట్టా రామ శేఖర్, రాష్ట్ర వైఎస్సార్ టీయూసీ జోనల్ అధ్యక్షునిగా భూపతి అజయ్‌కుమార్ (రాజోలు నియోజకవర్గం), రాష్ట్ర స్టూడెంట్ విభాగం అధికార ప్రతినిధిగా తాడి సహదేవ్ (రాజోలు నియోజకవర్గం), రాష్ట్ర సోషల్ మీడియా విభాగం కార్యదర్శిగా పడాల శ్రీహరికృష్ణ రెడ్డి (కొత్తపేట నియోజకవర్గం) నియమితులయ్యారు.

రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రుద్రరాజు



మలికిపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సఖినేటిపల్లి మండలం గుడిమూలకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు రుద్రరాజు వెంకట నరసింహ శ్రీ పద్మరాజు (చిన్నరాజా) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మాజీ మంత్రి రుద్రరాజు రామలింగరాజు కుటుంబం నుంచి చిన్నరాజాకు పార్టీ పదవి దక్కడంపై నియోజకవర్గ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. చిన్నరాజా శనివారం మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అలుపెరుగని కృషి చేస్తానన్నారు. తనకు పదవి కోసం సహకరించిన నియోజకవర్గ కోఆర్డినేటరు గొల్లపల్లి సూర్యారావు, నాయకులు కేఎస్ఎన్ రాజు, జంపన బుజ్జిరాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు, జెడ్పీటీసీలు దొండపాటి అన్నపూర్ణ, బల్ల ప్రసన్న కుమారి, మట్టా శైలజ, కుసుమ వనజ కుమారి, పాటి శివకుమార్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

10న మెగా పేరెంట్ టీచర్ సమావేశం

అమలాపురం రూరల్: ఈ నెల పదో తేదీన మెగా పేరెంట్ టీచర్ సమావేశం 2.0 నిర్వహించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విద్యా సంస్థలలో ఈ సమావేశాలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఈ సమావేశాలు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.

విద్యాభివృద్ధికి 'విట్‌నెస్' అవసరమా?

అమలాపురం టౌన్: ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పాఠశాలలో జరిగే మెగా పీటీఎంలో విట్‌నెస్ అధికారిని పాఠశాల హెచ్ఎం నియమించి వారి చేత వీడియోలు తీయించి అప్‌లోడ్ చేయాలనే సమగ్ర శిక్ష రాష్ట్ర శాఖ ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సురేంద్రకుమార్, ఎంటీవీపీఎస్ సుబ్బారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వీరు అమలాపురంలో విడుదల చేసిన ఓ ప్రకటనలో విట్‌నెస్ అధికారి విధానంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి విద్యార్థుల క్రమశిక్షణపైన, విద్యాభివృద్ధిపైన మాట్లాడుకోవటానికి ఇంత తతంగం అవసరమా అని వారు ప్రశ్నించారు. బోధనకు మాత్రమే ఉపాధ్యాయులను పరిమితం చేస్తామని చెప్పిన విద్యా శాఖ దానికి భిన్నంగా బోధనేతర కార్యక్రమలకూ వినియోగించడం తగదని నాయకులు పేర్కొన్నారు.

శృంగార వల్లభుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 15 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, పూలమాలలతో విశేషంగా అలంకరించారు. వివిధ సేవల టికెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా ఆలయానికి 3,84,962 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. 3,500 మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం చేశామన్నారు.

అభినందన సీమ



తమలపాకులు మోదలుగా సర్దుతూ బట్ట కడుతున్న రైతు

ఉద్యాన పంటలు భేష్

- అరుదైన ఎర్ర చక్కెరకేళీ సాగులో అగ్రస్థానం
- 'పాన్'కు పెట్టింది పేరు సీమ తమలపాకు
- కేరళను మించిన 'వక్క'
- ఘనా దేశానికి దీటుగా కోకో నాణ్యత
- గూడపల్లి మామిడికి యమ క్రేజ్

సండే స్పెషల్

సాక్షి, అమలాపురం: ఉద్యాన పంటల సాగులో జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ పండే పంటలకు దేశవ్యాప్తంగా గిరాకీ ఉంది. ఉత్తరాది రాష్ట్రాల వ్యాపారులైతే ఇక్కడి ఉత్పత్తుల కొనుగోలుకు ఎంతో ఆసక్తి చూపుతారు. పంటల సాగులో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు రుచిలోనూ చవులూరించడమే ఇందుకు కారణం.

ఆను'పాను' తెలుసు

కోనసీమ నుంచి వెళ్తున్న తమలపాకును ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల్లో కిళ్లీల తయారీలో ఎక్కువగా వినియోగిస్తారు. ఆనుపానులు తెలుసుకుని ఇక్కడ రైతులు పండించే తమలపాకు రుచి బాగుంటుందని ఉత్తరాది వ్యాపారులు చెబుతుంటారు. జిల్లాలోని పి.గన్నవరం, రావులపాలెం, అయినవిల్లి మండలాల్లో సుమారు 240 ఎకరాల్లో ఈ పంట పండుతోందని అంచనా. ఇప్పుడు పశ్చిమ గోదావరి నుంచి వచ్చే ఆకుతో కలిపి రోజుకు ఒక లారీ వరకు ఎగుమతి జరుగుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు.



రావులపాలెం మండలం గోపాలపురంలో తమలపాకు తోటలు

బ్రాండింగ్ కోసం కృషి



కోనసీమలో పండే గూడపల్లి మామిడి, ఎర్ర చక్కెరకేళీ, పనస, తమలపాకు, పోక, ఇతర ఉద్యాన పంటలకు అరకు కాఫీ తరహాలో ప్రత్యేక బ్రాండింగ్ కోసం కృషి చేస్తున్నాం. దీంతో పాటు సాగు విస్తీర్ణం పెంచేందుకు, మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు ఉద్యాన శాఖ ద్వారా రాయితీలు అందిస్తున్నాం.

– టీవీ రమణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ఆశ్చర్య'పోక' తప్పదు



రవాణాకు సిద్ధంగా ఎండబెట్టిన పోక

కోనసీమలోని అంబాజీపేట, పి.గన్నవరం, అయినవిల్లి, కొత్తపేటతో పాటు మండపేట మండలం ద్వారపూడి ప్రాంతంలో సుమారు 386 ఎకరాల్లో పోక (వక్క) సాగు జరుగుతోంది. కొబ్బరి తోటల్లో అంతర పంటగా, తోటల చుట్టూ గట్ల మీద ఈ పంట సాగవుతోంది. ఇక్కడి నుంచి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశాకు పోక ఎగుమతి అవుతోంది. పోక విస్తృతంగా పండే కేరళను మించి ఇక్కడ వక్క సాగవుతుందంటే ఆశ్చర్యపోక తప్పదు. ఎర్ర చెక్కల (పూజా సుపారీ) తయారీ ఇక్కడి ప్రత్యేకత.

'కోకో'ల్లలుగా గింజల దిగుబడి



ప్రపంచ ఖ్యాతిగాంచిన కోకో గింజలు

ఆఫ్రికా దేశాల్లో ఒకటైన ఘనాలో పండే కోకో గింజలు మాత్రమే నాణ్యమైనవని నిన్న మొన్నటి వరకూ పేరుండేది. కోనసీమలో పండే కోకో గింజలు ఇప్పుడు ఆ పేరును తుడిచిపెట్టేశాయి. జిల్లాలోని 3,800 ఎకరాల్లో కొబ్బరిలో అంతర పంటగా కోకో సాగవుతోంది. ఏటా సగటున 1,140 టన్నుల గింజలు ఉత్పత్తి అవుతున్నాయి. ప్రస్తుత మార్కెట్ రేటును బట్టి ఏటా రూ.54.20 కోట్ల విలువైన కోకో గింజల దిగుబడి వస్తోందని అంచనా.

గుండెలు 'గెల'చిన ఎర్ర చక్కెరకేళీ



రావులపాలెం మార్కెట్‌లో ఎర్ర చక్కెరకేళీ గెలలు

ఎర్ర చక్కెరకేళీ రుచిలో రారాజు. తమిళవాసులు అమితంగా ఇష్టపడతారు. టైప్–2 మధుమేహ బాధితులూ నిర్భయంగా తింటారు. కోనసీమతో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సుమారు 2 వేల ఎకరాల్లో ఈ పంట సాగవుతోందని అంచనా. గెల ధర ఏడాదిలో సగటున రూ.350 వరకూ ఉంటోంది. రావులపాలెం మార్కెట్ యార్డు నుంచి రోజుకు సగటున రెండు లారీల ఎర్ర చక్కెరకేళీ ఎగుమతి అవుతోంది.

పనస.. 'ఫల'ప్రదం



పనస కాయలు

పనస సాగుకూ కోనసీమ పెట్టింది పేరు. మార్చి నుంచి జూలై వరకూ పనస సీజన్. ఒక్కో చెట్టుకు 50 నుంచి 100కు పైగా కాయలు వస్తాయి. జిల్లావ్యాప్తంగా కొబ్బరిలో అంతర పంటగా సుమారు 100 ఎకరాల్లో సాగవుతుందని అంచనా. అంబాజీపేట కేంద్రంగా ఏటా రూ.కోటి విలువైన పనస కాయలు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయి.

ఏ దిల్ 'మ్యాంగో'మోర్



గూడపల్లి బంగినపల్లి మామిడి

కోనసీమ జిల్లా మలికిపురం మండలం గూడపల్లిలో పండే బంగినపల్లి కాయకు యమ క్రేజ్ ఉంది. ఈ సీజన్‌లో ఇక్కడ పండే బంగినపల్లికి ఉమ్మడి రాష్ట్రాలతో పాటు చెన్నై, బెంగళూరులో కూడా డిమాండ్ ఉంది. గూడపల్లితో పాటు చుట్టుపక్కల సుమారు 2 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది.



గూడపల్లిలో బంగినపల్లి మామిడి తోట

కర్ణాటక ఓపెన్ చెస్ విజేత అక్షయ జాతీయ స్థాయికి ఎంపిక



కర్ణాటక ఓపెన్ చెస్ చాంప్ కప్పును అందుకుంటున్న అక్షయ

అమలాపురం రూరల్: మండలంలోని సవరప్పాలేనికి చెందిన సత్తి అక్షయ కర్ణాటక ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. కర్ణాటకలోని అటామిక్ ఎనర్జీ సెంట్రల్ స్కూల్లో పదో తరగతి చదువుతున్న అక్షయ చదువుతో పాటు చెస్‌లో తన ప్రతిభను చాటి చరిత్ర సృష్టించింది. ఈ ఘనత ద్వారా జాతీయ స్థాయికి అర్హత సాధించిన తొలి మహిళా క్రీడాకారిణిగా ఆమె నిలిచింది. సవరప్పాలేనికి చెందిన అక్షయ తల్లిదండ్రులు వృత్తి రీత్యా కర్ణాటకలో స్థిరపడ్డారు. అక్షయ విజయంపై గ్రామంలో హర్షాతిరేకాలు మిన్నంటాయి. ఆమె జాతీయ స్థాయిలో విజయం సాధించాలని అక్షయ తాతయ్య సత్తి ప్రసాద్, నానమ్మ వరలక్ష్మి, కుటుంబ సభ్యులు కోరుకుంటున్నారు.

మానసిక ప్రశాంతతకు విపశ్యన ధ్యానం



విపశ్యన ధ్యాన తరగతులపై మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: ఒత్తిడిని అధిగమించి శాంతి సాధనకు విపశ్యన ధ్యానం మంచి మార్గమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎంఈవోలు, హెచ్ఎంలతో ఈ ధ్యానంపై సమీక్షించి విద్యార్థులతో సాధన చేయించాలని సూచించారు. చదువుకునే విద్యార్థులలో ఒత్తిడిని అధిగమించేందుకు, ఆధ్యాత్మిక మార్గం సాధనకు ఈ ధ్యానం ఉపకరిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం 8 వసతి గృహ పాఠశాలల్లో ఈ ధ్యానాన్ని ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు వ్యక్తిగత శ్రద్ధతో ఈ ధ్యానంపై ఆసక్తి ఉన్న విద్యార్థులను వయసుల వారీగా విభజించి ఆగస్టు 15 నాటికి డీఈఓకు ప్రతిపాదనలు అందజేయాలని సూచించారు. ఈ మేరకు మౌలిక వసతులు సమకూర్చుకోవాలని పేర్కొన్నారు. విపశ్యన ధ్యాన గురువు వాణి మాట్లాడుతూ జిల్లాలో 8 రెసిడెన్షియల్ పాఠశాలలో మిత్ర కార్యక్రమం ద్వారా 2700 మంది విపశ్యన ధ్యాన యోగలో శిక్షణ పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో ధ్యాన యోగ గురువులు లక్ష్మయ్య, నాగార్జున, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు పాల్గొన్నారు.

ఎన్ఎంఆర్ వేతనాల సవరణ

2025– 26 ఆర్థిక సంవత్సరానికి నాన్ మస్టర్ రోల్ వేతనాలు సవరించినట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. నైపుణ్యం కలవారికి రూ.734 నుంచి రూ.764 వరకు, మధ్యస్థాయి నైపుణ్యం చూపేవారికి రూ.518 నుంచి రూ.539 వరకు, నైపుణ్యం లేని పనివారికి రూ.416 నుంచి రూ.433 ల వరకు పెంచడం జరిగిందన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి వేతనాల సవరణ కోసం వివిధ విభాగాల ఇంజినీర్లు, కార్మిక శాఖ సహాయ కమిషనర్లతో సంప్రదింపులు జరిపి వేతనాలు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

రత్నగిరిపై భక్తజనవాహిని

- సత్యదేవుని దర్శించిన 25 వేల మంది
- 1,500 వ్రతాల నిర్వహణ
- దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని ఆలయానికి శనివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. స్వామివారిని 25 వేల మంది భక్తులు దర్శించుకోగా 1,500 మంది వ్రతాలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు 5 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. స్వామి, అమ్మవార్లకు ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాకారంలో తిరుచ్చి వాహన సేవ ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు తొలి ఏకాదశి

తొలి ఏకాదశి (ఆషాఢ శుద్ధ ఏకాదశి) పర్వదినం సందర్భంగా సత్యదేవుని ఆలయానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. ఈ సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ఉదయం 7 గంటలకు స్వర్ణ పుష్పాలతో, 9 గంటలకు కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించనున్నారు. సత్యదేవుడు, అమ్మవారిని ఉదయం 10 గంటల నుంచి ఆలయ ప్రాకారంలో టేకు రథంపై ఊరేగిస్తారు.



తిరుచ్చి వాహనంపై సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

'లోవ' భక్తుల కోసం లక్ష ప్రసాదం ప్యాకెట్లు

ఆషాఢ మాసం రెండో ఆదివారాన్ని పురస్కరించుకుని తలుపులమ్మ లోవ దేవస్థానానికి వెళ్లి, తిరిగి వచ్చే భక్తుల కోసం సత్యదేవుని గోధుమ నూక ప్రసాదం ప్యాకెట్లు సుమారు లక్ష సిద్ధం చేస్తున్నామని అధికారులు తెలిపారు. గత నెల 29న తొలి ఆదివారం 75 వేల ప్రసాదం ప్యాకెట్లు విక్రయించగా, రూ.15 లక్షల ఆదాయం సమకూరింది. ఈసారి లోవ భక్తులు మరింత ఎక్కువగా ప్రసాదం ప్యాకెట్లు కొనుగోలు చేస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నవరంలో రత్నగిరి తొలి పావంచా వద్ద, జాతీయ రహదారిపై పాత, కొత్త నమూనా ఆలయాల వద్ద ఉన్న కౌంటర్లలో ప్రసాదాల విక్రయాలకు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేశారు.

ప్రతిభావంతుల లెక్క తేలింది..

- జిల్లాలో పూర్తయిన సర్వే
- కొత్తగా 327 మంది గుర్తింపు
- జిల్లాలో ఇప్పటికే 2,896 మంది పిల్లలు
- గుర్తించిన వారికి సమీప పాఠశాలల్లో అడ్మిషన్లు

రాయవరం: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు సాధారణ విద్యార్థులతో సమానంగా విద్యనందించేందుకు కేంద్ర ప్రభుత్వం సహిత విద్యలో భాగంగా భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. వారి స్థాయి, అవసరాలకు అనుగుణంగా విద్యను అందించేందుకు వారికి ఈ కేంద్రాలు భరోసాగా నిలుస్తున్నాయి. మానసిక, శారీరక వైకల్యంతో బాధపడే ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ఏర్పాటు చేసిన భవిత కేంద్రాల బలోపేతానికి సమగ్ర శిక్షా చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా భవిత కేంద్రానికి వచ్చే చిన్నారులతో పాటు, రాకుండా ఇంటి వద్దే ఉంటున్న చిన్నారుల లెక్క తేల్చేందుకు మే 13వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ప్రత్యేక సర్వే నిర్వహించారు. సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ పర్యవేక్షణలో జిల్లాలో ఉన్న ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్స్ (ఐఈఆర్‌టీ) ఈ సర్వేలో పాల్గొన్నారు. ఈ సర్వే ద్వారా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు మరికొంత మందిని గుర్తించారు. జిల్లాలోని 22 మండలాల్లో ఇప్పటికే 2,896 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఉండగా, తాజాగా చేసిన సర్వేలో 327 మందిని గుర్తించారు. వీరందరికీ ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలు అందేలా జిల్లా అధికారులు సమగ్ర నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ

జిల్లాలో భవిత కేంద్రాలు	22
ప్రత్యేక అవసరాల పిల్లలు	2,986
భవిత కేంద్రాలకు వచ్చే వారు	486
హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ పొందుతున్న వారు	220
కేంద్రాల్లోని ఐఈఆర్‌పీలు	44
ఆయాలు	22
ఫిజియోథెరపిస్టులు	07

యూ–డైస్‌లో నమోదు

విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులను మండల యూనిట్‌గా లెక్కించారు. జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన 2,986 మందితో పాటు, కొత్తగా గుర్తించిన 327 మంది ప్రత్యేక అవసరాలు గల చిన్నారులందరికీ ప్రభుత్వ పాఠశాలల్లో వారి వయసుకు అనుగుణంగా ఆయా తరగతుల్లో ప్రవేశం కల్పించే దిశగా అధికారులు కృషి చేస్తున్నారు. ఆధార్ కార్డుకు అనుసంధానం చేస్తూ, ఆయా పాఠశాలల యూ–డైస్ కోడ్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేశారు. దీంతో ప్రత్యేక అవసరాల పిల్లల వాస్తవ గణాంకాల్లో పారదర్శకతతో పాటు, వారు ఎక్కడ చదువుతున్నారనేది తెలుసుకునే అవకాశం ఉంది.



భవిత కేంద్రంలో విద్యార్థికి ఫిజియోథెరపీ సేవలందిస్తున్న ఫిజియోథెరపిస్ట్

భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ

జిల్లాలో 22 భవిత కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ కేంద్రాలకు ఏడుగురు ఫిజియోథెరపిస్టులు చిన్నారులకు సేవలందిస్తున్నారు. అలాగే శారీరక, మానసిక వైకల్యంతో ఉన్న చిన్నారులు కావటంతో వీరికి ఆటపాటలతో చదువులు చెప్పాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలోనే అవసరమైన ఆట పరికరాలు, వస్తువులను కేంద్రాలకు సమకూరుస్తున్నారు. ప్రతి భవిత కేంద్రంలో ఇరువురు ఐఈఆర్‌పీలు కేంద్రానికి వచ్చే చిన్నారులకు విద్యను అందిస్తారు. వీరితో పాటు ప్రతి కేంద్రంలో ఒకరిని ఆయాగా నియమించారు. శారీరక వైకల్యం అధికంగా ఉన్న చిన్నారులకు ఇంటి వద్దనే అవసరమైన వైద్య సేవలు అందించేలా ఫిజియోథెరపిస్టులను ఏర్పాటు చేశారు. ప్రతి శనివారం హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా పాఠశాలకు వెళ్లని విభిన్న ప్రతిభావంతులైన చిన్నారుల ఇళ్లకు ఐఈఆర్‌పీలు వెళ్లి బోధన చేస్తారు.

ప్రతి ఒక్కరికీ అడ్మిషన్ ఇస్తున్నాం



సర్వే ద్వారా గుర్తించిన ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు పాఠశాలల్లో అడ్మిషన్లు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం. భవిత కేంద్రాల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. కేంద్రాల పనితీరును మెరుగుపరచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– ఎంవీవీ సత్యనారాయణ, సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్,

నైపుణ్యాలు పెంపొందిస్తున్నాం



ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు నైపుణ్యాలను పెంపొందించేందుకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నాం. శారీరక, మానసిక పరిస్థితికి అనుగుణంగా వారికి అవసరమైన విద్యను భవిత కేంద్రాల ద్వారా కల్పిస్తున్నాం. వారికి అవసరమైన ఉపకరణాలు అందించడంతో పాటుగా, అలవెన్సులను అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. భవిత కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నారు.

– జి.మమ్మీ, డిప్యూటీ కలెక్టరు, అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్, జిల్లా సమగ్ర శిక్షా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

క్లుప్తంగా

కూటమిలో మట్టి పంచాయితీ!

మర్లావ, ఆర్బీ పట్టణాల్లో జనసేన X టీడీపీ



మర్లావలో ట్రాక్టర్లలో తరలిపోతున్న ఏలేరు కాలువ మట్టి

పెద్దాపురం: గ్రామాల్లో కూటమి నేతల మధ్య ఆధిపత్యపోరు మొదలైంది. మండలంలోని మర్లావ గ్రామంలో టీడీపీకి చెందిన గ్రామ సర్పంచ్ తోట రామకృష్ణ జేసీబీతో ఏలేరు కాలువ మట్టిని తరలించుకుపోవడాన్ని జనసేన నాయకులు గవరసాని దివాకర్ వర్గీయులు వ్యతిరేకిస్తూ సోషల్ మీడియాతో పాటు, బహిరంగంగానే విమర్శలు చేసుకుంటున్నారు. అలాగే మండలంలోని దివిలి ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాలు టీడీపీ తమకు చెప్పకుండానే చేస్తున్నారని నీటి సంఘం ఉపాధ్యక్షుడు జనసేన నాయకుడు జట్లా విజయ్‌బాబు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అదే విధంగా మండలంలోని ఆర్బీ పట్నంలో చెరువు మట్టి తవ్వకాల విషయంలోనూ జనసేన, టీడీపీ వర్గీయుల మధ్య పోరు సాగుతోంది. అధికారులు ఇరువర్గాలకు చెప్పలేక మౌనం దాల్చడంతో ఆధిపత్యపోరులో కూటమి నేతలు చెలరేగిపోతున్నారు.

18 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

- కేసు నమోదు చేసిన అధికారులు
- రూ.8.28 లక్షల సరకు స్వాధీనం

దేవరపల్లి: నల్లజర్లలోని ఓ బియ్యం మిల్లు నుంచి తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలుకు లారీలో తరలిస్తున్న 400 బస్తాల బియ్యాన్ని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. మండలంలోని యర్నగూడెం–పోతవరం రోడ్డులో పట్టుకున్న బస్తాల్లో సుమారు రూ.8.28 లక్షల విలువైన 18 మెట్రిక్ టన్నుల బియ్యం ఉన్నట్టు మండల పౌరసరఫరాల అధికారి ఎ.సత్యనారాయణ తెలిపారు. కాగా అధికారులు నిర్వహించిన వేలంలో ఈ బియ్యాన్ని పాడుకుని తరలిస్తున్నట్టు మిల్లు యజమాని చూపిన పత్రాలు కాల పరిమితి ముగిసినవని గుర్తించినట్టు అధికారులు గుర్తించారు. లారీని, అందులోని బియ్యాన్ని స్వాధీనం చేసుకుని 6ఎ, 7 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. విచారణ అనంతరం వివరాలు తెలుస్తాయని డీటీ తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ఎస్. తాతారావు, సీఐ మధుబాబు, ఏఎస్‌ఓ నాగాంజనేయులు, వీఆర్వో ఎస్‌కే బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమ.. ప్రాణాంతకం కావచ్చు!

- మూగజీవాల పెంపకంపై అవగాహన అవసరం
- వాటిపై ప్రేమ మాటున పొంచి ఉన్న వ్యాధుల ముప్పు
- అశ్రద్ధ చేయవద్దంటున్న వైద్యులు
- నేడు ప్రపంచ జూనోసిస్ డే

ప్రేమ ఒక మత్తు. అది మనుషుల మీదయినా.. మూగ జీవాల మీదయినా. వీటి ప్రేమ అన్‌కండీషనల్. చిన్న బిస్కెట్ ముక్క పెడితే చాలు.. ఏళ్ల తరబడి ప్రేమ కురిపిస్తూనే ఉంటుంది. ఆ ప్రేమకి పడిపోని మనిమండడు. అవి ఏ స్థితిలో ఉన్నా దానిని ముద్దుచేస్తూ.. దాని నోటిలో చేతులు పెడుతూ.. దగ్గరకు తీసుకుని గాఢాలింగనాలు చేసుకుంటూ ప్రేమ వ్యక్తపరుస్తుంటారు. ఇది కొన్నిసార్లు ప్రమాదకరం కావొచ్చు. పాముకు పాలు పోసి పెంచినా దాని సహజ లక్షణం కాటు వేయడం. అలాగే కుక్కలు.. పిల్లులు.. కోతులు.. కుందేళ్ల వంటి మూగ జీవులను ఎంత ప్రేమగా పెంచినా స్వాభావికంగా చర్మం.. విసర్జకాలు.. వెంట్రుకలు.. చొంగ తదితరాలు ఎప్పటికీ ప్రమాద హేతువులే. వీటి నుంచి వచ్చే ఉపద్రవాలను గుర్తెరిగి తగినంత జాగ్రత్తలు తీసుకుంటూ వాటిని పెంచుకోవడం ఎంతైనా అవసరం. అలాగే వాటికి సంక్రమించే పలు రకాల వ్యాధులు మానవులకు హానికరం కాకుండా చూసుకుంటూ వాటి ఆరోగ్య పరిరక్షణకు సకాలంలో చర్యలు తీసుకుంటూనే వాటిని పెంచుకునేవారికి ఆ దుష్ప్రభావాలు సోకకుండా అప్రమత్తంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. మూగజీవాలు.. వాటి వల్ల వచ్చే వ్యాధులపై సరైన అవగాహన కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన జూనోసిస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

రాజమహేంద్రవరం రూరల్/బిక్కవోలు: సమాజంలో జంతు ప్రేమ రోజురోజుకూ పెరుగుతోంది. అదే సమయంలో వాటి వల్ల వచ్చే వ్యాధులపై వాటిని పెంచుకునేవారికి లేదనేది వాస్తవం. వైద్య పరిశోధన ప్రకారం జంతువల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు సుమారు 190 రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఇలా సోకే వ్యాధులను జునోసిస్ అంటారు. జూనిటిక్ వ్యాధులను వైరస్ బాక్టీరియల్, పారసైటిక్ వ్యాధులుగా విభజించారు. వైరస్ వలన సంక్రమించే వ్యాధులలో రేబిస్, మెదడు వాపు వ్యాధి, బర్డ్‌ఫ్లూ వంటివి ముఖ్యమైనవి. బాక్టీరియా వలన సంక్రమించే వ్యాధుల్లో బ్రూసెల్లా, సాల్మోనెల్లా, లెప్టోస్పైరోసిస్ మొదలైనవి ఉన్నాయి. కుక్కకాటుతో రేబిస్, పందుల వల్ల మెదడువాపు, పశువులు, గొర్రెల నుంచి టీబీ వ్యాధులు సంక్రమిస్తాయని, వీటన్నింటిలో రేబిస్ ప్రమాదకరమైనదని వైద్యులు పేర్కొంటున్నారు.

జూనోసిస్ ఎలా వచ్చిందంటే...

పిచ్చికుక్క కాటుకు గురైన వ్యక్తికి లూయీపాశ్చర్ అనే శాస్త్రవేత్త 1885 జూలై 6న మొట్టమొదటిసారిగా యాంటీ రేబిస్ టీకా ఇచ్చారు. ఇది విజయవంతమై అత్యంత ప్రాచుర్యం పొందింది. ఆ రోజుకు గుర్తుగా ఏటా ప్రపంచ జూనోసిస్ డే నిర్వహిస్తున్నారు.

వ్యాక్సినేషన్ ఎంతో అవసరం

పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్‌పై చాలా మందికి అవగాహన ఉండదు. కొందరు ఖర్చుతో కూడినదని, సమయం లేక అశ్రద్ధ చేస్తుంటారు. దీని వల్ల అవి కరిచిన, రక్కిన సందర్భాలలో ఏదైనా ఆరోగ్య సమస్య రావచ్చు. అందువల్ల వాటికి వ్యాక్సినేషన్ చేయించడం ఎంతో అవసరమని గుర్తించాలి.



బొమ్మూరులో పెంపుడు కుక్కలతో యజమాని



అనపర్తిలో పెంపుడు జంతువులకు టీకాలు వేస్తున్న పశువైద్యుడు

జాగ్రత్తలివీ

- పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు సకాలంలో వేయించాలి.
- టీకాల షెడ్యూల్‌ను తప్పనిసరిగా పాటించాలి.
- పెంపుడు జంతువులను, వాటి ఆహారాన్ని లేదా వ్యర్థాలను తాకిన తర్వాత చేతులను శుభ్రంగా కడగాలి. లిట్టర్ బాక్సులు, పంజరాలను తరచుగా శుభ్రం చేయాలి.
- బయట తిరిగే జంతువులకు క్రమం తప్పకుండా క్రిములను తొలగించాలి.
- పెంపుడు జంతువులు అడవి జంతువులతో కలవకుండా చూడటంతో పాటు, సరైన రక్షణ లేకుండా గాయపడిన అడవి జంతువులను రక్షించడానికి ప్రయత్నించకూడదు.
- జంతువుల అనారోగ్య లక్షణాలను గమనించాలి. ప్రవర్తన, ఆకలి, లేదా ఏవైనా మార్పులను గమనించడం, ఏదైనా అసాధారణమైనది గమనిస్తే వెంటనే పశువైద్యుడిని సంప్రదించాలి.

పాడి రైతులకు ఇలా..

- బలమైన జీవభద్రతా చర్యలను అమలు చేయాలి.
- పశువుల దగ్గరకు అవసరమైన వ్యక్తులను మాత్రమే అనుమతించాలి.
- జంతు సమూహాల మధ్య కదిలేటప్పుడు పాద రక్షలు, రక్షిత దుస్తులను ఉపయోగించాలి.
- పశుశాలలు, పాలు పిండే ప్రదేశాలు, పరికరాలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి.
- క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి.
- అనారోగ్యంతో ఉన్న జంతువులను వెంటనే మంద నుంచి వేరు చేయాలి.

కోళ్ల రైతులకు జాగ్రత్తలివీ

- ఒకే వయస్సు ఉన్న పక్షులను కలిపి పెంచాలి.
- గుంపుల మధ్య పూర్తిగా శుభ్రపరిచి, ఆ ప్రాంతంలో క్రిమి సంహార మందులు చల్లాలి.
- అడవి పక్షులతో సంపర్కాన్ని నివారించడానికి వలలు లేదా మూసిన గూళ్లను ఉపయోగించాలి.
- ఆహారం తీసుకోవడంలో లేదా గుడ్ల ఉత్పత్తిలో తగ్గుదల వంటి అనారోగ్య లక్షణాలను గమనించడంతో పాటు, అసాధారణ మరణాలు లేదా లక్షణాలను వెంటనే పశువైద్య అధికారులకు తెలియజేయాలి.

అవగాహన పెంచుకోవాలి

- జూనోటిక్ వ్యాధుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి.
- జంతు ఆరోగ్యం, జూనోసిస్‌పై వర్క్‌షాప్‌లు లేదా సెమినార్లకు హాజరుకావాలి.
- అనుమానిత జూనోటిక్ వ్యాధులను గుర్తిస్తే పశువైద్యులు, అధికారులకు తెలియజేయాలి.

జిల్లాలో జంతువులు వివరాలు ఇలా...

పెంపుడు కుక్కలు	11,159
ఆవులు	70,846
గేదెలు	1,67,106
గొర్రెలు	1,67,052
మేకలు	72,076
పందులు	1,207
పౌల్ట్రీ	1,77,86,778

వైద్యుల సలహాలు తప్పనిసరి



జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే రోగాలను జునాటిక్ డిసీజెస్ అంటారు. ఎబోలా, బర్డ్‌ఫ్లూ, రేబిస్, మెదడువాపు వంటివి ఈ రకమైనవే. ఇవి వ్యాప్తి చెందకుండా ఉండాలంటే వైద్యుల సలహాలు తప్పనిసరి. ఇంట్లో కుక్కలను పెంచేవారు చర్మ సమస్యలు వస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. సరైన వ్యాక్సిన్ వేయించకుండా పెంపుడు జంతువులు, కుక్కలతో సన్నిహితంగా ఉండొద్దు. ఆదివారం రాజమహేంద్రవరం ఏరియా పశువైద్యశాలలు, అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లోని పశువైద్యశాలల్లో టీకాలు వేస్తున్నాం. జూనోసిస్ వ్యాధులపై వైద్యాధికారులు అవగాహన కల్పిస్తారు. అలాగే పెంపుడు జంతువులకు, వాటితో దగ్గరగా మెలిగే యజమానులకు, పశుసంవర్ధకశాఖ సిబ్బందికి, మున్సిపల్ వర్కర్లుకు, జంతువధశాఖ సిబ్బందికి, జంతు ప్రేమికులకు ఉచితంగా యాంటీ రాబిస్ టీకాలు వేస్తాం.

–టి.శ్రీనివాసరావు, జిల్లా పశువైద్యాధికారి, తూర్పుగోదావరి

ముందస్తు నివారణ మేలు



జూనోసిస్ వ్యాధులు ప్రబలకుండా ముందుస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వల్ల మనుషులకు, అటు జంతువులకు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రాణాంతక జోనోసిస్ వ్యాధులపై సరైన అవగాహన ఉంటే చాలా వరకు వీటిని అరికట్టవచ్చు. జూనోసిస్ వ్యాధుల సంక్రమణ, నివారణపై విద్యార్థులకు అవగాహన కలిగించాలి.

– డాక్టర్ శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ ఏడీ, అనపర్తి

రాజీ మార్గమే రాజ మార్గం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజీమార్గమే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల జాతీయ లోక్ అదాలత్ శనివారం రాజమహేంద్రవరం జిల్లా కోర్టు ఆవరణలోని నిర్వహించారు. దీనికి హాజరైన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి 85 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిలో 60,642 కేసులు రాజీ చేసుకోదగినవని పేర్కొన్నారు. వీటిలో తాము 9,272 సివిల్ క్రిమినల్ కేసులు, 2,136 ప్రీ లిటిగేషన్ కేసు లు, మొత్తం 11,415 రాజీ చేసుకోదగిన కేసులుగా ఈ బెంచ్ రిఫర్ చేయడం జరిగినదన్నారు. కక్షిదారులు వెంటనే లాభం పొందాలనే ఉద్దేశంతో కేసులను రాజీమార్గంలో పరిష్కరిస్తున్నామన్నారు. గత ఏడాదిలో చేపట్టిన నాలుగు లోక్ అదాలత్‌లలో రూ.167 వందల కోట్లు కక్షిదారులకు నష్టపరిహారంగా అందజేసినట్టు తెలిపారు. తాజాగా పీడీజే కోర్టులోని 01/2025 కేసుకు



బాధితులకు చెక్కు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

బాధితుల కుటుంబానికి రూ.1.15 కోట్లు, 379/2023 కేసులో రూ.80 లక్షలు, 135/2025 కేసులో రూ.38.5 లక్షల చెక్కులను అంద చేశామన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శోభనాద్రి శాస్త్రి, పలువురు జడ్జిలు పాల్గొన్నారు. మొత్తం బెంచీలు 47 కాగా 6179 కేసులకు అవార్డులు ఇచ్చారు. రాత్రి 9.30 గంటల వరకు 473 సివిల్ కేసులు, 5514 క్రిమినల్ కేసులు, 192 పీఎల్‌సీ కేసులకు తీర్పులు ఇచ్చారు. ఇంకా కేసుల సంఖ్యను లెక్కిస్తున్నారు.

760 టన్నుల ఇసుక అక్రమ నిల్వ స్వాధీనం

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువు, బీజాపురి టౌన్‌షిప్‌లో రోడ్లపై అక్రమంగా నిల్వ చేసిన గోదావరి ఇసుకను వాహనాలతో సహా టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు మనీషా, శైలజ, ఎస్సై ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి దాడి చేసి రెండు చోట్ల నిల్వ చేసిన 760 టన్నుల ఇసుకను, అదే సమయంలో అక్కడకు అర టన్నులోడుతో వచ్చిన లారీని సీజ్ చేశారు. కాగా ఇసుక రవాణా బిల్లు ఉదయం తీసుకున్నప్పటికీ దానితోనే రోజంతా వీలైనన్ని ట్రిప్పులు వేస్తున్నట్టు గుర్తించారు. ఇసుక అక్రమ నిల్వలపై ఎవరు ఫిర్యాదు చేసినా వెంటనే చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ అధికారి డి. ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు.



ఇసుక నిల్వల వద్ద టాస్క్‌ఫోర్స్ అధికారులు

హత్య కేసు నిందితులకు రిమాండ్

సామర్లకోట: మండలం పి.వేమవరం గ్రామానికి చెందిన నొక్కు కిరణ్ కార్తిక్ (19) హత్య కేసు నిందితులు నూతలకట్టు కృష్ణప్రసాద్, దూల్లపల్లి వినోద్‌లను శనివారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు సీఐ ఎ.కృష్ణభగవాన్ విలేకర్లకు తెలిపారు. చెల్లితో మాట్లాడుతున్నాడని ఆమె అన్న కృష్ణప్రసాద్ తన స్నేహితుడు వినోద్‌తో కలసి కార్తిక్‌ను హత్య చేసిన విషయం తెలిసిందే. బ్రహ్మానందపురం జగనన్న లేఅవుట్‌లోకి కార్తిక్‌ను తీసుకువెళ్లి గొంతు నులిమి హత్యచేసినట్టు నిందితులు అంగీకరించారని, వీఆర్వో నాగేశ్వరరావు సమక్షంలో వివరాలు సేకరించి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. కార్తిక్ తండ్రి నొక్కు వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసిన మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చామని, కృష్ణప్రసాద్‌ను ఎ1గా నమోదు చేశామని సీఐ తెలిపారు.



నిందితులను హాజరుపరచి కేసు వివరాలు తెలియజేస్తున్న సీఐ కృష్ణభగవాన్

9 కిలోల గంజాయి స్వాధీనం

నలుగురి అరెస్టు

ముమ్మిడివరం/ఐ.పోలవరం: సర్కిల్ పరిధిలోని ఐ.పోలవరం మండలం మురమళ్ల పుష్కర ఘాట్ వద్ద తొమ్మిది కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురు యువకులను అరెస్టు చేశారు. సీఐ ఎం.మోహన్‌కుమార్ ముమ్మిడివరంలో విలేకరులతో మాట్లాడుతూ మురమళ్ల పుష్కర ఘాట్ వద్ద ఐదుగురు యువకులు గంజాయి కలిగి ఉన్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేశామని, వారిలో నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి 9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వారిలో ముగ్గురు పాత నేరస్తులుగా పోలీసులు గుర్తించారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నట్టు సీఐ తెలిపారు. సీఐ ఆధ్వర్యంలో ఐ.పోలవరం ఎస్సై ఎంవీవీ రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నిందితులను హాజరుపరచి కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ మోహన్‌కుమార్

ఢిల్లీ ఎయిమ్స్‌లో జాన్వికి సీటు



గారపాటి జాన్వి పద్మజ చౌదరి

చాగల్లు: గ్రామానికి చెందిన గారపాటి జాన్వి పద్మజ చౌదరి ఢిల్లీలోని ఏఐఐఎంఎస్ (ఎయిమ్స్)లో సీటు సాధించింది. ఎయిమ్స్ పీజీ ప్రవేశ పరీక్షల్లో ఆమె ఆలిండియా 163వ ర్యాంకు సాధించి ఈ ఘనత సాధించింది. ఆమె వైజాగ్ ఆంధ్ర మెడికల్ కళాశాల (కేజీహెచ్)లో ఎంబీబీఎస్ చేసిన ఆమె ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే అత్యుత్తమ ప్రతిభ చూపింది. సాధారణ రైతు కుటుంబంలో జన్మించి తల్లిదండ్రులు గారపాటి శ్రీనివాసరావు, నాగలక్ష్మి దంపతుల ప్రోత్సాహంతో ఈ సీటు సాధించడంపై బంధువులు, శ్రేయోభిలాషులు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నారు.

24 మంది జూదగాళ్ల అరెస్టు

జగ్గంపేట: పలు ప్రాంతాల్లో పేకాడుతూ పట్టుబడిన 24 మందిని పెద్దాపురం కోర్టులో శనివారం హాజరుపరిచినట్లు స్థానిక సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. వీరికి ఒక్కొక్కరికి రూ.300 చొప్పున మొత్తం రూ.7200 కోర్టు జరిమానా విధించిందన్నారు. ఏడు కేసుల్లో పట్టుబడిన రూ.37,100 కోర్టుకు దాఖలు చేసినట్టు తెలిపారు.

కాలువలో పడి వృద్ధుడి మృతి

ముమ్మిడివరం: నగర శివారు కాశివాని తూము సెంటర్ సమీపంలో పంట కాలువలో అదే ప్రాంతానికి చెందిన బొద్దు సత్యనారాయణ (79) ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. పంటకాలువలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. పక్షవాతంతో బాధపడుతున్న సత్యనారాయణ ప్రమాదవశాత్తు పడిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలాజీ స్వామి ఆదాయం రూ.2.75 లక్షలు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. తొలిహారతిలో భక్తులు భారీగా పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2,75,614 ఆదాయం వచ్చింది. నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.82,046 విరాళంగా అందించారు. 4,500 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 2,600 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ ఈఓ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.



అప్పనపల్లిలో తొలి హారతిని దర్శించుకుంటున్న భక్తులు

అమ్మోనియా లీకేజీపై మాక్ డ్రిల్

కాకినాడ రూరల్: రూరల్ మండలం వాకలపూడి గ్రామ పరిధిలోని కోరమాండల్ ఇంటర్నేషనల్ ఎరువుల కర్మాగారంలో నిల్వ ఉన్న అమ్మోనియా లీక్ అయితే తీసుకోవలసిన చర్యలుపై శనివారం మాక్ డ్రిల్ నిర్వహించారు. పరిశ్రమలశాఖ అధికారుల పర్యవేక్షణలో సంస్థ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరావు, ఇన్‌స్పెక్టర్ రాంబాబు సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.



అమ్మోనియా లీకైతే తీసుకోవాల్సిన చర్యలను చూపుతున్న ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిబ్బంది

భక్తులతో శోభిల్లిన వాడపల్లి

ఒక్కరోజు ఆదాయం రూ.60.42 లక్షలు



వాడపల్లి క్షేత్రంలో బాలికల నృత్య ప్రదర్శన

కొత్తపేట: కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రం శనివారం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రానికి ఏడు శనివారాల వ్రతంతో పాటు సాధారణ దర్శనాలకు వచ్చిన భక్తుల హరినామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. దేవదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్, అర్చకులు, వేదపండితులు సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వివిధ మార్గాల ద్వారా ఆలయానికి రూ.60,41,722 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. ధర్మపథంలో భాగంగా నృత్య కళాకారుల బృందం వేంకటేశ్వర వైభవం, తదితర కూచిపూడి, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు చేశారు.